క్లుప్తంగా...

ధర్మగిరిలో ప్రత్యేక పూజలు

శంషాబాద్: పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి, హోమం, పల్లకి సేవ పారాయణం, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాబాను దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకుని సేదతీరారు. ఆలయ ట్రస్టీ శివదత్తసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'కాలనీల కాంటాక్ట్' సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గం: కాలనీల కాంటాక్ట్ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతికాలనీ, బస్తీ, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లలో గల పలు సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ, వివిధ ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా వెళ్ళి సమస్యలు తెలుసు కోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టానన్నారు.

'సీఐఎస్‌సీఈ' ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

రాయదుర్గం: సీఐఎస్‌సీఈ ఫలితాలను ఆదివారం ప్రకటించారు. ఇందులో గచ్చిబౌలిలోని నాజర్ బాయ్స్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతిలో హంజా నిసార్ భాషా 99.6 శాతం, మీర్జా ఆయాన్ బేగ్ 98.4 శాతం, జి.అభినవ్ వర్మా 97.2 శాతం మార్కులను సాధించారు. అలాగే 12వ తరతగతిలో ఉర్వాహ్ మహ్మద్ పారూఖ్ 87.75 శాతం, ఇబాద్ రహమాన్ 86.5 శాతం మార్కులను సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ హఫీజుద్దీన్ అహ్మద్ అభినందించారు.

ఐఎస్‌సీ ఫలితాల్లో..

ఐఎస్‌సీ ఫలితాల్లో ముగ్గురు డిస్టింక్షన్, ఫస్ట్ క్లాస్‌లో అయిదుగురు ఉత్తీర్ణత సాధించారు. కాగా ఐసీఎస్‌ఈ ఫలితాల్లో 95 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 95 మంది ఉత్తీర్ణులయ్యారు.

నేడు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభం

జియాగూడ: ఈనెల 15న కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభోత్సవం ఉంటుందని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఉదయం నూతన భవనాన్ని ప్రారంభించడానికి ముఖ్యఅతిథులుగా హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ, గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, మీర్జా రహమత్ బేగ్, ఎంఎస్.ప్రభాకర్‌రావు, ప్రియా ఉల్ హసన్, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ ఓలేటి దామోదర్ గుప్తా, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్‌రతన్, ప్రత్యేక ఆహ్వానితులుగా డీజీపీ అంజనీకుమార్, ప్రిన్సిపాల్ సెక్రటరి జితేందర్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

గోల్కొండ: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని పురస్కరించుకుని షేక్‌పేట్ నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో షేక్‌పేట్ నాలా వద్ద ఈ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్ ఖాన్, బాలరాజ్, యాది, మక్బుల్, రవి, వెంకటేష్ తదితరులున్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు భేష్

గోల్కొండ: నిరుద్యోగులకు స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలకు వెలకట్టలేమని గోల్కొండ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు అన్నారు. యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారు గోల్కొండ బంజార దర్వాజ వద్ద గల అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బంజార దర్వాజ బస్తీ కమిటీ వారు ఐక్యంగా ఉండి నిరుద్యోగులు, స్థానిక మహిళల కోసం క్రమం తప్పకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల వారు సైతం తమ వద్దకు వచ్చి శిక్షణ పొందుతున్నారని, గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వైఎస్. అనురాధ దేవి అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్, యూనైటెడెట్ వే ఆఫ్ హైదరాబాద్ రేఖ, డైరెక్టర్ రాములు, కో-ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

అభినందన

అఫ్జల్‌గంజ్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడం అభినందనీయమని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. 10 కి 10 శాతం మార్కులు సాధించిన వినీత్ గుప్తాను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

సాంఘిక సంక్షేమ గురుకులం..

అన్నింటిలోనూ అగ్రస్థానం

- గురుకులాల్లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' విద్యాలయం
- రాష్ట్రంలో అత్యధిక ఉన్నతవిద్యా సౌకర్యం పొందుతున్న విద్యార్థులు
- ఫలితాల్లోనూ టాప్ ప్లేస్ సాధన
- ప్రతిభ చూపుతున్న గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు



గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులబాలికల కళాశాల, పాఠశాల ప్రధాన భవనం



చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థినులు

రాయదుర్గం: నాణ్యమైన విద్యాబోధన..ఫలితాల సాధన..ఉన్నత విద్యాకోర్సులలో సీట్లు ..అత్యాధునిక సౌకర్యాల కల్పనలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, పాఠశాల తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోంది. అందుకే ఈ విద్యాలయానికి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తింపు ఇచ్చారు. ముఖ్యంగా అంతా పేదింటి,గ్రామీణ ప్రాంత పిల్లలు కావడంతో ప్రత్యేక శ్రద్ధతో వీరిపై దృష్టి పెట్టి వీరికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఉన్నత విద్యా సంస్థల్లో ముఖ్యంగా ఐఐటీ, ఎన్ఐటీ, ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో సీట్లు సాధించడం లో గురుకులాల్లోనే టాప్‌గా నిలుస్తున్న విద్యా సంస్థగా గుర్తింపును గత కొన్నేళ్ళుగా సాధిస్తూ ముందుకు సాగు తోంది. చదువుతోపాటు క్రీడలలోనూ తనకంటూ ప్రత్యేకతను సాధిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలకు సవాల్‌ను విసురుతోంది. నాణ్యమైన విద్యబోధనలో తనదైన శైలిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ఉండే అధ్యాపకులు, ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థులు, ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్‌లోనూ కనిపిస్తోంది. గత కొన్నేళ్ళుగా తనకంటూ ఒక ప్రత్యేకతను ఈ విద్యాసంస్థ సాధించడం విశేషం.

పరీక్షలు ఏవైనా ఫలితాలు టాప్

- పదవ తరగతి, ఇంటర్ ఫలితాలలో టాప్ ప్లేస్ నిలుస్తోంది ఈ కళాశాల, పాఠశాల.
- ప్రతి యేటా 100 శాతం ఫలితాల సాధనలో తనకంటూ ప్రత్యేకతను సాధిస్తూ వస్తోంది.
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ చొరవ అధ్యాపకులు, ఉపాధ్యాయులు కృషి, విద్యార్థుల పట్టుదలతోనే ఈ ప్రతిభ చాటేందుకు అవకాశం కలుగుతోంది.
- ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల సాధనలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల టాప్‌లో నిలుస్తోంది.
- ఇందులో 'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్' పథకాన్ని 2015లో ప్రారంభించగా సత్ఫలితాలు ఇస్తోంది. అందులో భాగంగా 2015-16లో 43 మందికి, 2016-17లో 54 మందికి, 2017-18లో 45 మందికి, 2018-19 లో 78 మందికి, 2019-20లో 122 మందికి, 2020-21లో 203 మందికి ఎంబీబీఎస్, బీడీఎస్‌సీట్లు సాధించడం విశేషం.

చదువుతోపాటు క్రీడల్లోనూ టాప్..

- చదువులోనేకాకుండా విద్యార్థినీలు క్రీడల్లోనూ రాణించేలా వారికి ప్రత్యేక తర్ఫీదును ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. విద్యార్థినులు క్రీడల్లోనూ మక్కువ పెంచడంలోనూ ముందుంది.
- అర్చన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌లో ఇప్పటికే బంగారు పతకాన్ని జాతీయస్థాయిలో పొందింది
- పుట్‌బాల్‌లో 8వ తరగతి కోమలిక ఆలిండియా స్థాయిలో కాంస్యపతకాన్ని సాధించింది.
- 2018, 2019లో ఏడు సార్లు కోకో క్రీడలో 9వ తరగతి విద్యార్థిని కె దీక్షిత రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలను , రెండుసార్లు జాతీయ స్థాయి పోటీలో పాల్గొనడం విశేషం.
- 6 సార్లు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో 9వ తరగతి భవిత బంగారు పతకాన్ని సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది.
- అండర్-17 హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలో అర్చన స్వర్ణపతకం పొందింది.
- 2018, 2019లో రాష్ట్ర స్థాయి వివిధ క్రీడలలో 43 పతకాలను ఈ విద్యాసంస్థ పొందడం విశేషం.
- 2018,2019లో జాతీయ స్థాయి క్రీడా పోటీలలో 8 మంది విద్యార్థినీలు పాల్గొనడం విశేషం.

సమిష్టి కృషి, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే సాధ్యం..



ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల సమష్టి కృషి, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే కళాశాల/పాఠశాల అభివృద్ధి చెందుతోంది. పరీక్షలు ఏవైనా అన్నింటిలోనూ అత్యుత్తమ ప్రతిభను విద్యార్థినీలు చాటుతున్నారు. చదువుతోపాటు అన్నిరంగాలలో రాణించేలా వారిని ప్రోత్సహించడమే కాకుండా శిక్షణ కూడా ఇప్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి అన్నింటిలోనూ రాణించేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. అత్యాధునిక సౌకర్యాల కల్పన, బోధన, ఇతర అన్నింటిలోనూ ఉన్నతాధికారులు ముఖ్యంగా కార్యదర్శి నిరంతరం పర్యవేక్షించడం, సలహాలు ఇవ్వడంతోనే ఇదంతా సాధ్యమవుతోంది. భవిష్యత్తులో మరింత రాణించేలా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తాం.

– శారద-ప్రిన్సిపల్ గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల

పదోతరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో సత్తా చాటిన ఎస్‌ఎంపీ పాఠశాల



జే.రాహుల్



విశ్వతేజ



శ్రీవెన్నెల

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లోని ఎస్‌ఎంపీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పదోతరగతి సీబీఎస్‌ఈ పరీక్షా ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో 500ల మార్కులకు 473 మార్కులతో జే. రాహుల్ మొదటి స్థానం సాధించగా.. 468 మార్కులతో విశ్వతేజ ద్వితీయస్థానం దక్కించుకుంది. 457 మార్కులతో శ్రీవెన్నెల తృతీయ స్థానంలో నిలిచింది. పలువురు విద్యార్థులు 400 లకుపైగా మార్కులు సాధించారు. పాఠశాల మొత్తంలో 100% ఉత్తీర్ణతలో విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులంతా తమ శ్రమకు తగిన ప్రతి ఫలం సాధించారని కొనియాడారు.

కార్పొరేటర్ పర్యటన



రాజేంద్రనగర్: తేజస్వినీనగర్‌లోని సమస్యల పరిష్కారానికి తన శాయశక్తుల కృషి చేస్తానని అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ అన్నారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆమె బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రధాన రహదారికి నిధులు మంజూరయ్యాయని పనులు జరగడంలో జాప్యం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని రెండు, మూడు రోజుల్లో జోనల్ కమిషనర్‌తో కలిసి వివరిస్తానన్నారు. బస్తీలోని ప్రతి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, బీజేపీ నాయకులు రాములు, స్టార్ చిన్న తదితరులున్నారు.

ఘనంగా మదర్స్‌డే



చర్చిలలో తల్లులను సన్మానించిన సభ్యులు

మణికొండ: మణికొండలోని సేవియర్స్ లూథెరస్ చర్చిలో మదర్స్‌డే ను ఘనంగా నిర్వహించారు. సృష్టిలో తల్లి తరువాతనే ఏదయినా అని తల్లి తన పిల్లల కోసం సర్వసం దారపోస్తుందన్నారు. అమ్మ అనే పిలుపు కోసం ప్రతి స్త్రీ ఆరాట పడుతుందని పిల్లల భవిష్యత్తు కోసం ఆరాటపడేది తల్లి అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఫాస్టర్ ఎస్. రామకృష్ణ, సభ్యులు మాధురి నటరాజ్, ఇవేలేన్ గ్రేస్, ఝాన్సీ ఉదయ్, సుస్మిత, శైలజ, సుగుణ, ప్రతిభ, కీర్తి తదితరులున్నారు.

తలసీమియా సికిల్ సెల్ సొసైటీలో..

రాజేంద్రనగర్: అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్బంగా ఆదివారం శివరాంపల్లిలోని తలసీమియా సికిల్ సెల్ సొసైటీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసీమియాతో బాధపడుతున్న చిన్నారుల తల్లులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సంస్థ వైస్ ప్రెసిడెంట్ కె.రత్నవల్లి, సంస్థ కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. తలసీమియాను ప్రాథమిక దశలో గుర్తించేందుకు గర్భిణీ స్త్రీలందరూ.. తమ మొదటి త్రైమాసికంలో తప్పనిసరిగా హెచ్‌బీఏ-2 పరీక్షను చేయించుకోవాలన్నారు. వ్యాధి నివారణ, నిర్మూలనలో తల్లిపాత్రను వివరించారు. ఇది జన్యుపరీక్ష అని కౌన్సిలింగ్ ద్వారా నివారించగల అత్యంత సాధారణ జన్యు రుగ్మత అని తెలిపారు.



తలసీమియా సికిల్ సెల్ సొసైటీలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ కె.రత్నవల్లి, కార్యదర్శి

ఘనంగా హనుమాన్ జన్మదినోత్సవం



మణికొండ: హనుమాన్ జయంతి సందర్భంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఆయా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని హనుమాన్ దేవాలయం, క్వార్టర్స్‌లోని హనుమాన్ దేవాలయం, అంజలిగార్డెన్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయం, ల్యాంకోహిల్స్ పక్కన ఉన్న వీరాంజనేయస్వామి దేవాలయం, పుప్పాల్‌గూడ హనుమాన్ దేవాలయం, మంచిరేవుల, గండిపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, కోకాపేట, నెక్నాంపూర్ తదితర గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి హనుమాన్ చాలీసా పారాయణం, అర్చన, అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంచిరేవులలో జరిగిన పూజల్లో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మంచిరేవుల పూజల్లో పాల్గొన్న మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

సాయిరాం కాలనీ నూతన కార్యవర్గం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని సాయిరాం కాలనీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జె.రామస్వామి, అధ్యక్షుడిగా కన్నయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్. యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా హన్మంత్‌రావు, సంయుక్త కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా కె.నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సీహెచ్ నర్సింగ్‌రావు, కె. యాదయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎస్. మహేష్‌కుమార్, సత్యనారాయణ, ఎన్. నగేష్, ఎం. సూర్యకాంత్‌పాటిల్, దూదారాం, లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండేళ్ల పాటు కార్యవర్గం, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మణికొండ: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు రోడ్డు మధ్యలోని ప్రచార బోర్డుకు ఢీకొని తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్నాంపూర్‌కు చెందిన కె.లక్ష్మణ్ కుమారుడు కె.తరుణ్‌కుమార్ (18) ద్విచక్ర వాహనంపై సన్‌సిటీ నుంచి నెక్నాంపూర్‌కు వస్తుండగా.. రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌పై ఉన్న ప్రచార బోర్డును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల సాధనకు కృషి

గోల్కొండ: హక్కుల సాధనతో పాటు సంఘాన్ని బలోపేతం చేయుటకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘాలను ఏర్పాటు చేస్తామని ఎరుకల సంఘం రాష్ట్ర నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన ఎరుకల సంఘం సిద్దిపేట జిల్లా అడ్‌హాక్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరుకల కులస్తుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని, సంఘంలో విద్యావంతులు ప్రధాన పాత్రను పోషించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జంట నగరాలలో సంఘం బలీయంగా ఉందని, తెలంగాణ జిల్లాలో సైతం ప్రతి జిల్లాకు కమిటీలు వేస్తామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ఎన్నో కులాల వారు ప్రభుత్వంతో పోరాడి హక్కులు సాధించవచ్చని, కుల సంఘాల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలంతో పాటు నిధులు కేటాయించవచ్చన్నారు. ఎరుకల సంఘానికి కూడా జాగాను కేటాయించారని సంఘం సభ్యులంతా కలిసి అత్యాధునిక వసతులతో నిర్మించుకుందామని ఆయన అన్నారు. ప్రభుత్వం నుండి తమకు కులస్తులకు అందుతున్న పథకాల లబ్ధి పొందాలని, దీని కోసం సంఘం వారు కుల సభ్యులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట్ హడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి సోమయ్య, కోశాధికారి కనకయ్య పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో పేర్లు చూసుకుని నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న రాచూరి రాజశేఖర్

రాజేంద్రనగర్: ఓటర్ లిస్టులో తమ పేర్లను సరి చూసుకొని లేనివారు తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రాచూరి రాజశేఖర్ సూచించారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్‌లోని తేజస్వినీనగర్ శక్తి కేంద్రం నిర్వహించిన నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుపై అవగాహన ఉండాలని ఆన్‌లైన్ ద్వారా ప్రస్తుతం తమ ఓటు ఉందో.. లేదో.. తెలుసుకోవచ్చన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కాడెం సుధాకర్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు విజయ్‌కుమార్, శక్తి కేంద్రం సహ ఇన్‌చార్జ్ దుర్గప్రసాద్, బూత్ అధ్యక్షుడు అంకుర్ బన్సాల్, సంతోష్ కలేకర్, చరణ్ ప్రసాద్, రామమూర్తి, సుందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి ముందు పార్కు చేసిన స్కూటీ చోరీ

రాజేంద్రనగర్: ఇంటి ముందు పార్కు చేసిన స్కూటీ మాయమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేమావతిపేట భవాని కాలనీ రోడ్డు నంబర్-6 ప్రాంతానికి చెందిన పట్లోల శ్రీధర్ రెడ్డి నివసిస్తున్నారు. శనివారం రాత్రి 9.30 గంటలకు తన ఇంటి ముందు (టీఎస్07 హెచ్‌ఎం8065) బీఎస్-6 బ్లాక్ కలర్ స్కూటీని ఎప్పటిలాగే తన ఇంటి ముందు పార్కు చేసి ఇంట్లోకి వెళ్లాడు. తిరిగి భోజనం చేసిన అనంతరం స్కూటీని ఇంట్లోకి తీసుకురావడానికి రాత్రి 11 గంటలకు బయటికొచ్చి చూడగా.. స్కూటీ కనబడలేదు. దీంతో అప్రమత్తమైన బాధితుడు చుట్టు పక్కల, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాయమవుతున్న బైక్‌లు...

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బైక్ దొంగలు విజృంభిస్తున్నారు. నగరంలోని రద్దీ స్థలాలు, శివారు కాలనీల్లో బైకు దొంగలు రెచ్చిపోతున్నారని సమాచారం. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఆసుపత్రులు, రెస్టారెంట్లు ప్రాంతాల్లో ఎక్కువగా వాహనాలు చోరికి గురౌతున్నాయి. మద్యానికి బానిసైన యువకులు పార్కు చేసి ఉంచిన బైక్, ఆటో, కారు రెప్పాటు సమయంలో మాయం చేస్తున్నారు. ఈ ఘటనలు సైబరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల వ్యాప్తంగా రాత్రి వేళల్లో ఇంటి ముందు నిలిపిన తరువాత రోజు ఉదయం చూసేసరికే వాహనాలు కనిపించడం లేదు. కాగా దొంగలు ఎత్తుకెళ్లిన ద్విచక్ర వాహనాలు మధ్య తరగతి వారివే కావడం బాధకరం.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్ సనా హోటల్, మేరాజ్ కాలనీ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో డ్రైనేజీతో పాటు వర్షపునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. అయితే డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చివరి దశకు వచ్చాయన్నారు. పైప్‌లైన్ పనుల్లో కూడా వేగం పెంచామని, ఈ పనులను ప్రతినిత్యం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర డివిజన్లలో వరదనీటి పైప్‌లైన్ పనుల కారణంగా ట్రాఫిక్ మళ్లించడం జరిగిందని, మరికొన్ని చోట్ల ఈ పనుల వల్ల స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులున్నారు.